విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 26,జనవరి 2024

పంటలకు నిప్పు

రూ.15 లక్షల పైగా ఆస్తి నష్టం
లబోదిబోమంటున్న బాధిత రైతులు
బాధిత రైతులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో ఆరుగాలం కష్టించి, చెమటోడ్చి పండించిన పంట దిగుబడులను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన అంబటి శేఖర్ రెడ్డి సాగుచేసిన ఐదు ఎకరాల జొన్న పంట, పాణ్యం వెంకటేశ్వరమ్మ, బాలయ్యలకు చెందిన నాలుగు ఎకరాల పొగాకు దిగుబడులు, కమ్మరి రవికుమార్ ఆచారి, విశ్వనాథరెడ్డిలకు చెందిన 5.10 ఎకరాల్లో కంది పంటను నూర్పిడి చేసేందుకు పొలంలో సిద్ధంగా ఉంచుకున్న దిగుబడులను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సమయంలో నిప్పు పెట్టారు. రైతులు గురువారం ఉదయం పంట పొలాలకు వెళ్లి చూడగా పంట దిగుబడులు కాలిపోయి ఉంది. దీంతో బాధిత రైతులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కాలి బూడిదైనా దిగుబడిన చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ.15 లక్షల పైగా నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఉయ్యాలవాడ పోలీస్స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ బిజెపి నాయకులు భూమా కిషోర్ రెడ్డి, జనసేన నాయకులు ఇరిగెల విశ్వనాథరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుడ్డ చంద్రమోహన్ రెడ్డి, సర్పంచ్ పల్లె గురు ప్రసాద్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జల కృష్ణారెడ్డి, అంబటి తులసిరెడ్డిలు కాళీ బూడిదైన దిగుబడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందెలా తమ వంతు కృషి చేస్తామని రైతులకు హామీని ఇచ్చారు.

కాలి బూడిదైన పోగాకు దిగుబడులను పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

రైతులను పరామర్శిస్తున్న బిజెపి నాయకులు భూమా కిషోర్ రెడ్డి

ఒకటి కొండుపల్లెలో కాళీ బూడిదైన కంది పంట

జర్నలిస్టులకు పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్: ఎన్నో సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిని చేపట్టి జీవనం గడుపుతున్న జర్నలిస్టులకు వెంటనే నివాస స్థలాలు కేటాయించాలని పలువురు పాత్రికేయులు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటరెడ్డికి , తహశీల్దార్ విద్యాసాగర్ కు గురువారం పాత్రికేయులు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడేషన్లు కలిగి ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని అధికారులను కోరారు. పాత్రికేయులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇంటి పట్టాలను మంజూరు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్డీవో వెంకటరెడ్డి తహశీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. ఆర్డీఓకు వినతి పత్రం అందించిన వారిలో సీనియర్ పాత్రికేయులు విజ్జీ, లక్ష్మీనారాయణ ,ఆంజనేయులు ,మల్లికార్జున ,మురళి, కడియాల శేఖర్, జర్మియ, సుధాకర్ ,తారక్ శేఖర్ రెడ్డి, సుధాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దుఖానంలో చోరి

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న మహబూబ్ బాషా టీ దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని దుండగులు స్థానిక టీదుకాణం తాళాలు పగులగొట్టి అందులోని రూ 5 వేల నగదు. మరో రూ.3వేల విలువ చేసే సిగరెట్లు చోరీకి పాల్పడ్డారు అలాగే చాగలమ్మ దేవాలయంలోని గంటను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశీలిస్తున్నారు.

సీపీఐ నిధుల సేకరణ

విశాలాంధ్ర - మహానంది : మహానంది మండలం అబ్బీపురం గ్రామంలో గడపగడపకు సిపిఐ పేరుతో నిధుల సేకరణ. చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సిపిఐ జిల్లాసమితి సభ్యులు ఆర్ సామేలు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు.మదిలేటి. పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి,గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. 11 వ పిఆర్సిలో 2022 నుండి తగ్గించిన అదనపు క్వాంటమ్ను గతంలో మాదిరిగా పునరుద్ధరించాలన్నారు.పెండింగ్లో ఉన్న డిఆర్ బకాయిలను,11 వ పిఆర్సి ఎరియర్స్ను వెంటనే చెల్లించాలన్నారు.హెల్త్కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన వైద్యశాలలలో వైద్యం అందించాలని,మెడికల్ రీఇంబర్స్మెంట్ పరిధిని రూ 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు. అనంతరం తహసీల్దారు సుభద్రమ్మ కు తమ డిమాండ్ల వినతి పత్రాన్ని అందజేసారు.కార్యక్రమం లో పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కోశాధికారి రంగయ్య,సభ్యులు అన్నా సత్యనారాయణ,జబ్బార్,సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్బరాయుడు హుండీ ఆదాయం 23.76 లక్షలు

విశాలాంధ్ర-పాణ్యం : మండల పరిధిలోని ఎస్.కొత్తూరులో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ లెక్కింపు ద్వారా 23.76 లక్షల ఆదాయం వచ్చింది అని ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులు కానుకల రూపంలో 104 రోజులకు స్వామివారికి సమర్పించిన హుండీ లెక్కించగా 23,76,741/- నగదు,బంగారం ఆరు గ్రాముల 600 మిల్లి గ్రాములు,వెండి రెండు కేజీల 837 గ్రాములు వచ్చిందన్నారు.కార్యక్రమంలో నంద్యాల దేవాదాయ శాఖ తనిఖీ అధికారి శశికుమార్,ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి,పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి,శివరామిరెడ్డి,ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి,లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు,అప్రైజర్ మాధవస్వామి, బ్యాంక్ అధికారులు అఖిల్,నంద్యాల సేవకులు తదితరులు పాల్గొన్నారు.

చాబోలు గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : చాబోలు గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ,ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి లు తెలిపారు. గురువారం నంద్యాల మండలం చాబోలు గ్రామంలో 30లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ నిర్మాణ పనులను ఎమ్మెల్యే, ఎంపీలు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఎంపీటీసీ చిన్నయ్య,సర్పంచ్ కడియం మౌనిక,నాగనందరెడ్డి, రాజగోపాల్ రెడ్డి,మదర్ సా,పాలమాబు,బాల ఉషేని,వేణుగోపాల్ రెడ్డి,మధుగోపాల్ రెడ్డి,విశాల్ రెడ్డి, మహేష్,మరియు గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ

విశాలాంధ్ర - నంద్యాల : తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నంద్యాల పట్టణ, మండలాలకు సంబంధించి జయహెూ బీసీ కార్యక్రమాన్ని గురువారం ఖలీల్ థియేటర్ ప్రాంగణంలో మాజీ మంత్రి, టీడీపీ నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభకు పెద్ద ఎత్తున బీసీలు, ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ కోసం చంద్రబాబు 36 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. ఇప్పుడున్న జగన్ ప్రభుత్వం 76 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల కోసం ప్రవేశపెట్టిన 30 పైగా పథకాలను జగన్ రద్దుచేసి, బీసీలకు తీరని ద్రోహం చేశాడన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్, నాయకులు బాబన్ తదితరులు మాట్లాడుతూ వైసిపి పాలనలో అణచివేతకు గురైన బీసీ ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న బీసీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, ముప్పు తిప్పలు పెట్టారన్నారు. వీరందరికోసం అండగా తెలుగుదేశం ఎల్లపుడూ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, బిసి నాయకులు జిల్లెల్ల శ్రీరాములు, గోవింద్ నాయుడు, బోయ రామకృష్ణ, ఉప్పరి సురేష్, బుగ్గ రాముడు, విజయగౌరి యాదవ్, కౌన్సిలర్ జైనాబీ, కౌన్సిలర్ నాగార్జున, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పా వెంచర్ లో దళిత అమ్మాయి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మండలం పాండు రంగాపురం వద్ద శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వేసిన శిల్ప వెంచర్ లో గత మూడు రోజుల కిందట 14 సంవత్సరాల దళిత అమ్మాయి ప్రమీల ఆత్మహత్య చేసుకోవడం వెనుక అనేక అనుమానాలున్నాయని, వెంటనే అధికారులు సమగ్ర విచారణ జరిపించి రీ పోస్టుమార్టం నిర్వహించాలని, శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు బండి ఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన ముస్లిం మహిళపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలోసిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు,జిల్లా సహాయ కార్యదర్శిఎస్.బాబాఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ శిల్పా వెంచర్లలో గత రెండు రోజుల కిందట దార ప్రమీల అనే 14 సంవత్సరాల దళిత అమ్మాయిని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం జరిగిందని, ఈ విషయాన్ని మాఫీ చేయడానికి ఆత్మహత్య చేసుకుందని,వారి తల్లిదండ్రులు లేకున్నా హడావిడిగా పంచనామా చేయకుండా దహన సంస్కారాలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తుందని, ఈ విషయంపై ఎస్పీ, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి రీ పోస్టుమార్టం జరిపించాలన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసు అధికారుల నిర్లక్ష్యం వల్ల పోలీస్ కానిస్టేబుల్ సురేంద్రను హత్య చేసినా పట్టించుకోక పోవడం వల్ల పట్టణంలో పాటు జిల్లాలో అనేక ప్రాంతాలలో అధికార పార్టీ నాయకులు పెంచి పోషిస్తున్న రౌడీ గ్యాంగులు, మహిళలపై హత్యాచారాలు చేస్తూ, దౌర్జన్యాలు నిర్వహిస్తూ హత్యలు,దొంగతనాలు, అధిక వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాల వల్ల రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నా చోద్యం చూడడం తప్ప చేసింది ఏమి లేదని విమర్శించారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీలు శిల్ప వెంచర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి,లింగాపురం గ్రామానికి చెందిన ముస్లిం మహిళపై హత్యాచార ఘటన కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని లేని పక్షంలో సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

శిరసాల కుటుంబ ఆత్మహత్యకు కారకులెవరు

- అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్యకు కారణం ఎవరు
- మీ వెంచర్ లో మానభంగం చేసి గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని కాల్చివేయడంలో ఆంతర్యం ఏమిటి
- శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ మంత్రి అఖిలప్రియ ఫైర్

విశాలాంధ్ర - నంద్యాల : శిరసాల కుటుంబ ఆత్మహత్యకు కారకులెవరు, అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్యకు కారణం ఎవరు, మున్సిపల్ ఉద్యోగి సెల్ఫీ తీసుకొని చేసుకున్న అత్మహత్యకు కారకులెవరు, మీ వెంచర్ లో మానభంగం చేసి గుట్టు చప్పుడు కాకుండా శవాన్ని కాల్చివేయడంలో ఆంతర్యం ఏమిటని ఆత్మకూరు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఫైర్ అయ్యారు. గడప గడపకు కార్యక్రమం సందర్భంగా శిల్పా అనుచరులు ఒంటరి మహిళపై అఘాయిత్యాలు చేయడం కోసమేనా తమ్ముడు శిల్పా చక్రపాణి రెడ్డి అంటూ భూమా అఖిలప్రియ ఘాటు వ్యాఖ్యలు చేశారు. లింగాపురం గ్రామంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించినప్పుడు భర్త చనిపోయిన ముస్లిం మహిళ ముంతాజ్ బేగంపై నీ కార్యకర్తలు నవాబు, డ్రైవర్ శ్రీను, సీతాలు అత్యాచారం జరిపింది వాస్తవం కాదా, బయటకు చెప్తితే చంపేస్తామని బెదిరించింది నిజం కదా అని భూమా అఖిల ప్రియ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని ప్రశ్నించారు. రెండు రోజుల కిందట శిల్పా చక్రపాణి రెడ్డి భూమా అఖిలప్రియపై చేసిన వ్యాఖ్యలపైన ఆమె ఘాటుగా స్పందిస్తూ గురువారం నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీరు గడప గడపకు ఎందుకు తిరుగుతున్నారు ఇలాంటి దుర్మార్గాలు చేయడానికేనా అంటూ భూమా అఖిలప్రియ నిలదీశారు. బాధితురాలు పోలీస్ స్టేషన్ కు వెళ్లి తనపై బలవంతంగా అత్యాచారం చేశారని కేసు నమోదు చేయాలని పోలీసులకు పిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకోలేదంటే ఎవరిని కాపాడటానికి పోలీసులు ఉన్నారని ఆమె ప్రశ్నించారు. శిల్పా చక్రపాణిరెడ్డి వెంచర్ లో జరిగిన ఓ దళిత మైనర్ బాలికపైన అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటనపై మాజీ మంత్రి అఖిలప్రియ విరుచుకుపడ్డారు. శిల్పా చక్రపాణి రెడ్డికి ప్రెస్ మీట్ పెట్టడానికి టైం ఉంది కానీ 8 సంవత్సరాలుగా తన వద్ద పనిచేస్తున్న మనిషి కూతురు చనిపోతే చూడటానికి వెళ్ళడానికి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పే టైం లేదా,ఎందుకు రాలేదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి సమయం దొరకలేదా, ఆత్మహత్య చేసుకుని చనిపోతే గొంతు మీద ఉరి వేసుకున్న ముద్ర ఉండాలి వెంటనే ఎస్పీకి, సిఐకి ఫోన్ చేసామని చెప్తుతున్నావే. కానీ డిపార్ట్మెంట్ వారు రెవెన్యూ వారిని శవ పంచనామా కోసం ఎందుకు తీసుకుపోలేదని అఖిల ప్రియ శిల్పా చక్రపాణి రెడ్డిని నిలదీశారు. గతంలో నీవు చేసిన వేధింపుల వల్లనే నంద్యాల పట్టణానికి చెందిన శిరసాల సీతారామయ్య కుటుంబం మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు.మీ అనుచరులు చేస్తున్న అకృత్యాల వలన అనేక మంది బలైపోయారని అందుకు కారణమైన వారిని మీరు కాపాడటం లేదా అని ప్రశ్నించారు. కుల సంఘాలను దూషించడం అమానుషమని, కమిషన్ల కోసం కుల సంఘాలు ఇలాంటి చర్యలకు పాడుతాయని అనడం దుర్మార్గ మని, నీ రాజకీయ అరంగ్రేటం గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు.మేము అధికారంలోకి వస్తాం, మీ అన్యాయాల, అరాచకాల చిట్టా విప్పుతామని చక్రపాణిరెడ్డికి వారి అనుచరులకు సవాల్ విసిరారు. శిల్పా చక్రపాణిరెడ్డి లింగాపురంలో మీ అనుచరులు మైనార్టీ యువతిని రేప్ చేశారని బాధితురాలు మీడియా ముందు మొరపెట్టుకున్నా వారికి న్యాయం జరగలేదని, పోలీసులు స్పందించి ముంతాజ్ బేగంకు న్యాయం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ కోరారు. విలేకర్ల సమావేశంలో అత్యాచారానికి గురైన బాధితురాలు ముంతాజ్ బేగం, ఆమె తల్లి పాల్గొన్నారు.

"నాపైన అత్యాచారం చేశారని చెప్పిన పోలీసులు పట్టించుకోలేదు"

– బాధితురాలు ముంతాజ్ బేగం

తనపైన ఎమ్మెల్యే మనుసులు అత్యాచారం చేశారని మీడియా ముందు బాధితురాలు ముంతాజ్ బేగం తెలిపారు. గడప గడపకు కార్యక్రమం లింగాపురంలో జరిగినప్పుడు ఎమ్మెల్యే మా ఇంటి వద్దకు వచ్చినప్పుడు తనకు భర్త లేడు, చనిపోయాడని వితంతు పెన్షన్ ఇవ్వాలని కోరగా ఎమ్మెల్యే చెందిన వ్యక్తులు నవాబు, డ్రైవర్ శ్రీను, చింతల్ అనే వ్యక్తులు ఫొటోలు, నా మొబైల్ నంబర్ తీసుకోని రోజు ఫోన్ చేసి వేధించేవారని, ఆత్మకూర్కు రావాలని పిలిపించి నాపైన అత్యాచారం చేశారని తెలిపారు. జరిగిన సంఘటనపైన పోలీసులకు పిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, మీదే తప్పు వుంది పొమ్మని పోలీసులు కేసు నమోదు చేసుకోలేదని భాధితురాలు వాపోయారు.

ఓటు సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

- ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి
- జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్

విశాలాంధ్ర - నంద్యాల : ఓటు హక్కును చక్కగా సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్యలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈసారి ఎన్నికల్లో 84 శాతం ఓట్లు పోలయ్యే లక్ష్యాన్ని కలెక్టర్ నిర్దేశించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటింగ్ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం అన్ని పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. అనంతరం ఓటు హక్కును వినియోగించుకుంటున్న 101 సంవత్సరాల సీనియర్ సిటిజన్ సుబ్బన్నను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఓటరుగా కొత్తగా నమోదైన యువ ఓటర్లకు, వికలాంగత్వ ఓటర్ కు ఎపిక్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ అనురాధ, నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, కమిటీల నోడల్ అధికారులు, డిఈఓ సుధాకర్ రెడ్డి, కళాశాల, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత సజ్జలకు లేదు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ గురించి, కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత సజ్జలకు లేదని.. సజ్జల నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. ఆళ్లగడ్డలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమలో కర్నూల్లో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తానని రాయలసీమ ప్రజలను మోసం చేసింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి బతికినంత కాలం బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేశారని. ఈరోజు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీజేపీకి కట్టు బానిస అయ్యారన్నారు. జాబు క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాదా అని లక్ష్మీ నరసింహ యాదవ్ ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను నెరవేర్చేది ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే రాజశేఖర్ రెడ్డి ఆశయమని, ఆ ఆశయం కోసమే షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరిందన్నారు. ఈనెల 29న పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి చేపట్టిన ఉమ్మడి జిల్లాల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బరగొడ్ల హుస్సేన్ బాషా, ఆళ్లగడ్డ నియోజకవర్గం కో - ఆర్డినేషన్ సభ్యులు చాకలి పుల్లయ్య, గంధం మల్లేశ్వర రెడ్డి , డాక్టర్ వెస్లీ, నరసింహులు , చాంద్ బాషా, నవీన్ , జిల్లా కార్యదర్శి సంజీవ కుమార్, నాగయ్య , పాపాజీ, మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ
మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నేడు నిర్వహిస్తున్న మండల స్థాయి జయహో బీసీ కార్యక్రమాని విజయవంతం చేయవలసిందిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక టిడిపి కార్యాలయంలో 3.30 జరుగుతున్న సమావేశానికి టీడీపీ బీసీ సెల్ కమిటీలోని నాయకులు, బనగానపల్లె మండలంలోని బీసీ క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్లు, మండల పరిధిలోని గ్రామాల బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు.

పైడాల బ్రదర్స్ రోడ్డు పనులను అడ్డుకున్న సీపీఐ నేతలు

కూలీ పని చేయించిన మేస్త్రీకి బిల్లులను ఆపేసిన కాంట్రాక్టర్

విశాలాంధ్ర - బేతంచెర్ల : మండల పరిధిలోనే కాక నియోజకవర్గ పరిధిలో ఆర్థిక మంత్రి చొరవతో అభివృద్ధి పనులు వేగవంతంగా దూసుకెళ్తోన్న తరుణంలో ఆ పనులకు సంబంధించిన బడా కాంట్రాక్టర్ పైడాల అలియాస్ పిటిఆర్ బ్రదర్స్ కు చేసే రోడ్డు పనులని సీపీఐ నాయకులు గురువారం అడ్డుకోవడం కలకలం రేపుతోంది.వివరాలలోనికి వెళితే ఈ బడా కాంట్రాక్టర్ పిటీఆర్ దగ్గర పశ్చిమ గోదావరి జిల్లా తణుకు గ్రామానికి చెందిన కోలాటి సత్యనారాయణ, అతని కుమారుడు సతీష్ లు రోడ్డు పనులకు సంబంధించి బ్రిడ్జి ల నిర్మాణాలకు కూలీ పనులు చేయించగా వీరికి రూ.10.50 లక్షల రూపాయల ఇవ్వకుండా బెదిరింపులకు దిగడంతో దిక్కుతోచని పరిస్థితులలో ఈ నెల 12 వ తేదీన సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య కు ప్రయత్నం చేసిన విషయం విధితమే.సీఐ హామీతో ఈ నెల 20 తేదీన పోలీస్ స్టేషన్ కు వచ్చి ,మేస్త్రీ అయిన సత్యనారాయణ, అతని కుమారుడు సతీష్ కు రావాల్సిన డబ్బులు చేస్తామని చెప్పగా నిజమే అని నమ్మి సెల్ టవర్ దిగడంతో కథ సుకాంతమైన విషయమూ తెలిసిందే. అయితే కాంట్రాక్టర్ పిటీఆర్ మాయ మాటలు అని నిర్ధారణ కావడంతో సీపీఐ మండల కార్యదర్శి యన్న భార్గవ్ ను సంప్రదించి తమకు న్యాయం చేయమని అభ్యర్థించడం తో వారి నేతృత్వంలో బేతంచెర్ల పట్టణం నుండి వెల్దుర్తి వరకు జరిగే రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ పైడాల బలరామిరెడ్డి పై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేసి రోడ్డు కూలి పని చేసిన సత్యనారాయణ కు రావాల్సిన పది లక్షల 50 వేల రూపాయలను చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కూలి పనులు చేసుకునే వారికి బిల్లులు ఇవ్వకుండా ఆపేసిన పైడాల బల రామిరెడ్డి నియంత పోకడలు అవలంబిస్తున్నాడని, సత్యనారాయణ కుటుంబ మొత్తం మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుంటే పిటీఆర్ దే బాధ్యతని,తక్షణమే సత్యనారాయణ కు రావాల్సిన డబ్బులు ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి పిటీఆర్ కంపెనీ ని బ్లాక్ లిస్ట్ లో పెట్టి భాదితులకు రావాల్సిన సొమ్మును ఇప్పించే బాధ్యత తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో బాధితుని కుటుంబ సభ్యులు ఈశ్వరమ్మ, సిరి,మరియు సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, మండల నాయకులు శ్రీనివాసులు,రవి,శ్రీకర్ ,మధు దిలీప్ ప్రదీప్,నంద విశ్వనాథ్,సతీష్ ,చింతలయ్య ,దుర్గారావు ,తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని 16వ వార్డు లోని స్వామి రెడ్డి నగర్ కాలనీవాసులకు మంచినీటి పైప్ లైన్ లీకు కావడంతో అక్కడ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ లింగేశ్వరరావుకి గురువారం వినతిప త్రం ఇవ్వడం జరిగింది.ఏపీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గిడ్డమ్మ,పి.శ్రావణిలు మాట్లాడుతూ గత మూడు నెలలుగా స్వామి రెడ్డి నగర్ కాలనీలో ప్రజలకు త్రాగునీరు అవసరమైనటువంటి మెయిన్ పైప్‌లైన్ లీక్ అవడం వల్ల కాలనీవాసులు మంచినీటి కోసం ఇబ్బందు లకు గురవుతున్నారని వారు అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని వారు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామలింగేశ్వర సంధిస్తూ మంచి నీటి పైపులైన్ కు సంబంధించి సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు వాటి పైన దృష్టి సారించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర పార్టీ సహాయ కార్యదర్శిలు సి.మహేష్ శ్రీనివాసరావు, స్వామి రెడ్డి నగర్ మహిళా సమైక్య నాయకుల కోటమ్మ జిల్లా నాయకురాలు రేణుక, కామేశ్వరి, ఈశ్వరమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 29 న విజయ వాడలో జరిగే వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు పిలుపుని చ్చారు. గురువారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను స్థానిక సీఆర్ భవన్ నందు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరా ములు, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య ,బిసన్న ,నగర నాయకులు చంటి,సురేంద్ర, మునిస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో 2014 ఎన్నికలకు ముందు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కూడా కారు చౌకగా అంబానీ ,ఆదాని లాంటి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు.భారతదేశాన్ని నిరుద్యోగ దేశంగా మారుస్తున్నాడన్నారు. రాష్ట్రంలో జగన్మో హన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వానికి ఓట్లేసి గెలిపిస్తే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టి ఐదు సంవత్సరాలు అవుతూ ఉన్న ఇంత వరకు ఒక్క జాబ్ క్యాలెండర్‌కూడా విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కోసం కుటుంబాలకు దూరంగా చిన్నచిన్న గదులలో అర్ధాకలితో ప్రభుత్వ ఉద్యో గమే లక్ష్యంగా చదువుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇదిగో డీఎస్సీ అదిగో డీఎస్సీ అని మాయ మాటలు చెబుతూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతూ ఒక్క డీఎస్సీ నోటిఫికే షన్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ ఇండియా పేరుతో సదస్సు నిర్వహించి యువతలో చైతన్యం నింపి రాష్ట్ర ప్రభు త్వాలపై తిరుగుబాటు బావుట ఎగరవేసి ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యంగా పోరాటాల రూపకల్పన చేయడానికి లివాయిస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సదస్సు వేదికలి కానుంది కావున సదస్సుకు జిల్లా నుండి అధిక సంఖ్యలో నిరుద్యోగులు ఏఐవైఎఫ్ కార్యకర్తలు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజల పక్షం నిలబడే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - కౌతాళం : ప్రజల కోసం ప్రజల పక్షం నిలబడే దినపత్రిక విశాలాంధ్ర అని జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్ పేర్కొన్నారు. గురువారం విశాలాంధ్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం అన్వేషిస్తూ వాటిని ప్రచురిస్తూ అధికారుల, ప్రజాప్రతినిధుల తీసుకెళ్లి పరిష్కరించే దిశగా వారధిలా తన కర్తవ్యాన్ని ఏడుస్తున్న పత్రిక విశాలాంధ్ర అని కొనియాడారు. ఇలాంటి పత్రిక పోటీ ప్రపంచంలో మరింత పదునుగా దూసుకెళ్లాలని ఆకాంక్షించారు. లాభసాటిగా పనిచేస్తున్న పత్రికా రంగంతో పోటీపడి కార్మిక, కర్షక, ఉపాధ్యాయ, యువత కోసం దిక్సూచిలా ముందుకు అడుగులు వేసిన పత్రిక అని పేర్కొన్నారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలలో కూడా పత్రికా రంగం విస్తరించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు.

టీడీపీ తోనే బీసీలకు రాజకీయ లబ్ధి



విశాలాంధ్ర - పెద్దకడబూరు : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు టీడీపీ ద్వారానే రాజకీయ లబ్ది చేకూరిందని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమ్మైన పెద్దకడబూ రులోని టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్వగృహం నందు జయహో బీసీ కార్యక్రమం మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అణగారిన వర్గాల అభ్యున్నతికి టిడిపి కట్టుబడి ఉంద న్నారు.బీసీల ద్రోహి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. అలాగే ఈ నెల 28న పత్తికొండలో జరిగే రా కదలిరా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, బీసీ సాధకార సమితి సభ్యులు మల్లికార్జున, దశరథరాముడు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీ కలలు కన్నా స్వరాజ్యం జగన్ తోనే సాధ్యం

విశాలాంధ్ర - కల్లూరు : గాంధీజీ కలలుకన్న స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని బస్తిపాడు, చిన్నటేకూరు గ్రామాలలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రజలు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలకు వెళ్లి పడిగా పులు కాసి అధికారులు వచ్చిన తర్వాత పనులు చేయించుకుని వచ్చేవారని నేడు స్వగ్రామాల్లోనే అన్ని పనులు సచివాలయాల్లో ప్రజల ముందే క్షణాల్లో పరిష్కారమై సుపరిపాలన జరుగుతుందని ఈ పరిపాలన వైకాపా ప్రభుత్వానికే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా అర్హులైన నిరుపేదలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కల్లూరు తహశీల్దార్, పలువురు గ్రామంలోని మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం హంగామా - డ్యాన్స్ రియాలిటీ షో

విశాలాంధ్ర - కర్నూల్ : తెలుగు ప్రేక్షకులకు సరికొత్త కాన్సెప్ట్తో అలరించే జీ తెలుగు ఈ ఆదివారం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న యాక్షన్‌ఎం టర్టైనర్ భగవంత్ కేసరి సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ఈ ఆదివారం అందిస్తోంది.అంతేకాదు,తెలుగు ప్రేక్షకులను బుల్లితెర, వెండితెర పై అలరిస్తున్న తారలు తమ జోడీతోకలిసి జంటగా తమలోని ప్రతిభను నిరూపించుకునేందుకు సూపర్ జోడీవేదికను అందిస్తోంది జీ తెలుగు. నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ హిట్ భగవంత్కేసరి ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు మరియు మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగాసూపర్ జోడిప్రారంభం, ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, జీతెలుగులో మాత్రమే.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీలో ఉన్న మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థినిలు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ఎంపిక కావడంతో గురువారం పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థినీలను అభినందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ముగ్గురు విద్యార్థినిలు ఎంపిక కావడం మంచి శుభ పరిణామమన్నరు. రాబోయే ఏడాదిలో ఎక్కువమంది విద్యార్థినిలు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ఎంపిక కావాలని, ఉపాధ్యాయుల ప్రోత్సాహం సంపూర్ణంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు గురురాజా, ప్రియాంక,అయ్యరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నకడ బూరు గ్రామంలో ఎమ్మిగ నూరు డీఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ సిబ్బంది కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన గుడిదల రామాంజి, తాయన్న అను ఇద్దరు వ్యక్తుల నుంచి 5 బాక్సుల 90 ఎం ఎల్ టెట్రా ప్యాకెట్స్ కర్ణాటక మద్యం లభించినట్లు ఎస్ ఐ మహేష్ కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు ఆయన వెల్లడించారు.

ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టారూణుకకే....

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎమ్మిగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఇప్పటికే వైకాపా మాచాని వెంకటేష్‌ను ప్రకటించింది. మాచాని వెంకటేష్ ఇన్‌చార్జి నియామకంపై వైసీపీ నేతల్లో అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తప్పని పరిస్థితుల్లో మాచాని వెంకటేష్ పేరును అదిష్టానం వద్ద చెప్పినా తన కుమారునికి సీటు ఇప్పించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. మాచానికి సీటు కేటాయింపుపై పార్టీలో తీవ్ర అసంతృప్తి ఉంది. మాచాని ఇన్‌చార్జిగా ప్రకటించిన తరువాత పార్టీ పరిస్థితులపై నియోజకవర్గంలో సర్వే చేయించాలని ఆశావహులు మాజీ ఎంపీ బుట్టారేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మెన్ రుద్రాగౌడ్‌లు అదిష్టానంపై వత్తిడి తీసుకు వచ్చారు. దీంతో మరోసారి సర్వే నిర్వహించగా మాచాని పట్ల నియోజకవర్గంలో కార్యకర్తలతో పాటు ప్రజల్లో రిపోర్టు ఆశాజనకంగా లేనట్లు తెలుస్తుంది. దీంతో అదిష్టానం ఎమ్మిగనూరుపై పునరాలోచనలో ఉన్నట్లు గా పుకార్లు ఉన్నాయి. ఆశావహులు బుట్టారేణుక, రుద్రాగౌడ్‌లు అదిష్టానంపై వత్తిడి పెంచినట్లు తెలుస్తుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డికి సీటు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదిష్టానం ఎంపీ సీటును మంత్రి గుమ్మనూరు జయరాంకు అధికారికంగా ప్రకటించినా ఆయన అయిష్టంగా ఉన్నారు. ఆయన ఆలూరు సీటు కావాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరతారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే కర్నాటక రాష్ట్రం కు చెందిన డీకే శివకుమార్ , తన సోదరుడు కర్నాటక మంత్రి నాగేంద్ర ద్వారా గుమ్మనూరు తనకు కర్నూలు ఎంపీ తన కుమారుడు ఈశ్వర్‌కు ఆలూరు శాసనసభ సీటు ఇప్పంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే జరిగితే బుట్టారేణుక ఎమ్మిగనూరు శాసనసభ లేక కర్నూలు ఎంపీ సీట్లలో అదిష్టానం ఏసీటు ఇచ్చినా పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే బుట్టారేణుకకు సీటు కేటాయిస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మద్దతు ఇస్తారా లేదా అనేది తేలాలంటే ఎన్నికల వరకు ఆలోచించాల్సిందే. ఎమ్మిగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బుట్టారేణుక....

క్రిష్ణా నది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కృష్ణానది నీటి నిర్వహణకు అత్యంత కీలకమైన శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలు లో "కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం" ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఒక లేఖ ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గురువారం నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తున్నాం అని ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి శాసనసభలో ప్రకటిం చడాన్ని స్వాగతించామనీ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ కడప కేంద్రంగా జనవరి 17, 2020 న పెద్ద ఎత్తున సంకల్ప దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించామని ఈ సందర్భంగా శ్రీబాగ్ ఒడంబడిక స్ఫూర్తితో పాలనా వికేంద్రీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రకటించిన విధంగా వికేంద్రీకరణ చేపట్టక పోగా, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖకు సిఫార్సు చేయడం రాయలసీమ వాసులకే కాకుండా, యావత్తు ఆంధ్రప్రదేశ్ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. కృష్ణా నదికి ఏ మాత్రం సంబంధంలేని విశాఖపట్నంలో ఏర్పాటు చేసే నిర్ణయాన్ని పునః సమీక్ష చేసి,బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలతో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. అందులో ముఖ్యమైన కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖలో పొందుపరిచామన్నారు. జనవరి 6, 2021 న కొల్లి నాగేశ్వర రావు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో, విజయవాడ కేంద్రంగా అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం, నవంబర్ 4, 2023 సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ కేంద్రంగా రౌండ్ టేబుల్ సమావేశం. సమావేశాలు ఆందోళన లు నిర్వహించామని తెలియ చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు అధికారులు కృష్ణా నది బోర్డు కార్యాలయం విశాఖపట్నంలో ఏర్పాటు సరైనది కాదు అని పేర్కొన్న సందర్భంలోనైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు. "శ్రీబాగ్ ఒడంబడికను" గౌరవిస్తూ, "ఆంధ్రప్రదేశ్ ప్రజల నిర్ణయాన్ని" పరిగణిస్తూ, "ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపిస్తూ", కృష్ణా నది నీటి నిర్వహణకు కీలకమైన కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం "కర్నూలు"లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని దశరథరామిరెడ్డి లేఖ ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశామని తెలియచేశారు.

ఓటు తోనే దేశ భవిష్యత్తు

విశాలాంధ్ర - కర్నూల్ జిల్లా పరిషత్ : ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్న యువతకు సూచించారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుండి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి యువత ఓటు హక్కు గురించి చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యవంతులను చేయాలన్నారు.. అలాగే ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే మన భవిష్యత్తుకు మంచి మార్గం వేసుకున్న వారం అవుతామన్నారు. ఓటు హక్కు కలిగిన విద్యార్థులు ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో పోలింగ్ శాతం చాలా తక్కువగా అవుతుందని, అలా కాకుండా పోలింగ్ శాతం పెరిగేలా యువత ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ శాతం పెరిగేలా చూడాలని యువతకు సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వరం అని, కావున ఓటు హక్కును వినియోగించుకోవడం ఓటరు యొక్క బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు, నోడల్ ఆఫీసర్ (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) శ్రీనివాస్ కుమార్, సెట్కూర్ సీఈఓ రమణ, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, ఎన్నికల విభాగపు సూపరింటెంట్ మురళి, వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు ఓటు

సమాజంలో మార్పు కోసం ఓటును విధిగా వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని : ఓటు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు, సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటి అమూల్యమైన ఓటును ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా వినియోగించుకొని, ఓటుతో భవిష్యత్తు బాటలు వేయాలని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం భారత ఎన్నికల సంఘం" 14వ జాతీయ ఓటర్ల దినోత్సవము - 2024 అవగాహన కార్యక్రమం సందర్భంగా ఆదోని మునిసిపల్ హై స్కూల్ నందు విద్యార్థులు ,అధికారులు, కలిసి ర్యాలీని సబ్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్ నుండి టూ టౌన్ పోలిస్ స్టేషన్ మీదుగా భీమస్ ప్రధాన కూడలి నందు మానవహారం నిర్వహించి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. ప్రతి ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తామని హాజరైన వారితో తాసిల్దార్ వెంకట లక్ష్మీ ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్స్ అయిన ఈరన్న, డి.గోపాల్ రావునీ సబ్ కలెక్టర్ సన్మానం చేశారు. 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వినియోగంపై అవగాహన కల్పించారు. మనం వేసిన ఓటు వారికే నమోదు అయినదా లేదా అని వారికి ఈవీఎం మిషన్ ద్వారా తెలియజేసి అవగాన కల్పించారు.

ఓటుతోనే భవిష్యత్తుకు బాటలు

విశాలాంధ్ర - చిప్పగిరి : అమూల్యమైన ఓటుతోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చిప్పగిరి తాసిల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిప్పగిరి లోనే జిల్లా పరిషత్ పాఠశాల నుండి 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థి విద్యార్థినులిచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా గొప్పదని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తు తరం పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రజాసేవ చేసే నాయకులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ స్వామి, రెవెన్యూ కార్యదర్శి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం టికెట్ బీసీలకే కేటాయించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మంత్రాలయం నియోజకవర్గం లో అత్యది కంగా మెజార్టీ కలిగిన బీసీ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు రాజకీయ పార్టీలను కోరారు. మంత్రాలయం కేంద్రంలో వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న మంత్రాలయంలోని వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బీసీ ఫెడరేషన్ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,బీసీ ఫెడరేషన్ నాయకు లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు శ్రీనివాస్ నాయుడు బెస్త మత్స్యకార సంగాల ఐక్యవేదిక నాయకులు పగడాల కోదండ,సహకార సంఘాల ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యక్షులు వీరేష్,నవీన్, చిన్న ఈరన్న,భాష తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు

విశాలాంధ్ర-కోసిగి: జిత్తులమారి,మాటల మాంత్రికుడు చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి మోసపోవద్దని అక్కాచెల్లెమ్మలకు మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డు నందు యంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నాలుగు విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి మండల ఇంచార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ,గత చంద్రబాబు ప్రభుత్వంలో అక్కాచెల్లెమ్మలకు రుణాలు కట్టొద్దని మేమే చెల్లిస్తామని మాయ మాటలు చెప్పి,అమలు చేయని కారణంగా, మన జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి సంపూర్ణంగా వరుసగా నాలుగో ఏడాది పొదుపు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.నేడు అందిస్తున్న 5 కోట్ల 96లక్షల రూపాయలతో కలిపి వైఎస్సార్ ఆసరా క్రింద మన మండలంకు 20 కోట్ల 4లక్షల 49 వేల రూపాయలు పొదుపు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలుపుతూ,ఈ ఉత్సాహం చూస్తుంటే మళ్ళీ 2024ల సియంగా జగన్ గెలుపొందడం ఖాయమని ఎమ్మెల్యే ధీమాను వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో తాహాశీల్దార్ రుద్రగౌడ్,సిఐ ప్రసాద్,యస్ఐలు సతీష్ కుమార్,నరేంద్ర కుమార్ రెడ్డి,మండల,గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మంత్రి గుమ్మనూరు జయరాం... ?

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర కార్మికశాఖా మంత్రి గుమ్మనూరు జయరాంకు అదిష్టానం కర్నూలు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది.ఆలూరు నుండి చిప్పగిరి జడ్పీటీసీ బి.విరూపాక్షి ఆలూరు నియోజకవర్గం ఇన్‌చా ర్జిగా ప్రకటించింది. దీంతో మనస్థాపంకు గురైన జయరాం అదిష్టానం నిర్ణయం పట్ల అసంతృప్తిగా ఉన్నారు. తనకు ఆలూరు ఇవ్వాలని కోరినా అదిష్టానం కర్నూలు నుండి పోటీ చేయాలని కోరడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే ప్రచారం ఉంది. ఇప్ప టికే కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆ రాష్ట్ర మంత్రి గుమ్మనూరు సోదరుడు నాగేంద్ర ద్వారా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది.ఆలూరు నుండి గుమ్మనూరు తనయుడు ఈశ్వ ర్‌కు ఆలూరు శాసనసభ సీటు ఇవ్వాలని కోరినట్లు తెలుస్తుంది. అందుకు కాంగ్రెస్‌పార్టీ అంగీకరిస్తే గుమ్మనూరు మరి కొద్ది రోజుల్లో కాంగ్రెస్‌లో చేరతారనే పుకార్లు వస్తున్నాయి. గుమ్మనూరు జయరాం కాంగ్రెస్‌పార్టీలో చేరితో జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలిపడంతో వైసీపీకి బారీ నష్టం జరిగే అవకాశం ఉంది. ఇది టీడీపీకి కలిసి వస్తుందని వైసీపీ బారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

నేడు ట్రాక్టర్ ర్యాలీ

విశాలాంధ్ర - కర్నూలు : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేఖ విధానాలను వ్యతిరేఖిస్తూ గురువారం నగరంలో చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీరైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం కోరారు. గురువారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేఖంగా నల్లచట్టాలను తీసుకు వచ్చి మోసం చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ఎన్నొ ఉద్యమాలు చేసి సాధి ంచుకున్న 44 కార్మికచట్టాలను రద్దుచేసి 4 కోడ్‌లు విభజి ంచడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం,రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం దారుణమ న్నారు. వీటన్నింటికి నిరసనగా చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.కొత్త బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించడ ంజరుగుతుందన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆస్పరి : రా..కదిలిరా... కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 28న పత్తికొండకు వస్తున్నారని, ఈ పర్యటనను నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, మాజీ మండల కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, తిమ్మన్న లు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ పార్క్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు న్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు ప్రతి ఒక్కరూ స్వస్తి పలకాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు రాజ్ కుమార్, తంగరుడోన మల్లేశప్ప, సీతన్న, నాగేంద్ర, రంగస్వామి, నాగన్న, రవి, మహానంది, రాఘవేంద్ర, కిష్టప్ప, చిన్న,ఓంకార్ లు పాల్గొన్నారు.

వైయస్ షర్మిల పర్యటనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పత్తికొండ : ఈనెల 29న కర్నూల్ లో జరిగే ఏపీ సి సి రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల పర్యటన ను జయప్రదం చేయాలని డిసిసి జిల్లా అధ్యక్షులు బాబురావు, మాజీ మంత్రి మూలింటి మారెప్పలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గ ఇన్చార్జి క్రాంతి నాయుడు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశాభివృద్ధి కుంటుపడిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రాకతో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. అనంతరం పట్టణంలోని రాజారెడ్డి నగర్ ను సందర్శించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బతుకన్న, లాజరస్, వెంకట్, విక్రమ్ నాయుడు, ఏవి నాయుడు, హుస్సేన్, రహీం, నాగార్జున, షబ్బీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు,బదిలీలు కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల వలె మునిసిపల్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు,బదిలీలు ఉండవా అంటూ గురువారం ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీర చంద్ర యాదవ్ మీడియా ముఖంగా ప్రభుత్వాన్ని నిలదీశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం చేసి,స్కూల్ అసిస్టెంట్,అర్బన్ విద్యాశాఖ అధికారి,డిప్యూటీ డిఈఓ పదోన్నతులు కల్పిస్తూ, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ లోకి జీవో నెంబర్ 84 వచ్చినప్పటి నుంచి మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పుకొచ్చారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయు ల వలె మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేది మన ఓటే

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తి ఓటు హక్కుకు మాత్రమే ఉంటుందని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ మరియు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరిం చుకుని యువతీ యువకులకు ఓటు హక్కు ప్రాధాన్యత పై అవగాహన కల్పించి యువతి యువకులతో ఓటర్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా న్యాయవాది ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ మాట్లాడుతూ అందరూ ఓటు వేసినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుందని, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును పొందేలా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎస్.సేహజాద్, జె.మధుసూదన్ రావు, డి. శ్రీనివాసులు యాదవ్,లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ అధ్యక్షు రాలు లయన్ రాయపాటి నాగలక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 26, జనవరి 2024

అన్ని అసెంబ్లీ స్థానాలలో పోటీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలోని అన్ని స్థానాలలో ఒంటరిగానే పోటీ చేస్తామని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసేది ఎస్పీ పార్టీని అని బహుజనులందరూ కలిసి రావాలన్నారు. గురువారం అనంతపురం జిల్లా పర్యటనకు ఆయన వెళుతూ మార్గమధ్య లోని కొలిమిగుండ్ల నందు సీనియర్ నాయకులు పోతిరెడ్డి వెంకట్ సుబ్బారెడ్డిని పోతిరెడ్డి సేవ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితుల గురించి ఇరువురు చర్చించారు. సమాజ్వాది పార్టీలోకి రావాలని పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిని వెంకటేశ్వర్లు కోరగా అభిమానులు కార్యకర్తలతో చర్చించినిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎస్పీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కులమత వర్గాలకతీతంగా అందరి అభివృద్ధిని పార్టీ కోరుకుంటుందన్నారు. ఏపీలో నాలుగు ప్రధాన పార్టీలు రెండు కుటుంబాల చేతిలోనే ఉన్నాయన్నారు. 80% పైగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు అధికారం దక్కినప్పుడే సమన్యాయం చేరుకూరుతుందన్నారు. మతతత్వ బిజెపికి వైసిపి, జనసేన, టిడిపిలు తోక పార్టీలుగా మారాయన్నారు. సీమ ప్రాంతం చెందిన సీఎంలుగా ఉన్న ఈ ప్రాంతానికి చాలా అన్యాయం జరిగిందని, అభివృద్ధికి ఆమడ దూరం ఉండి వెనుక బడిందన్నారు. రైతులకు సబ్సిడీపై అందించే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ముఖ్యమంత్రి జగన్ విఫలమయ్యారన్నారు. జగన్ పాలనలో ల్యాండ్, మైనింగ్,లిక్కర్, ఇసుక దోపిడీ యదేచగా జరుగుతున్నదన్నారు. కుల జన గణన జరిగితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు దామాషా పద్ధతిలో అందరికీ అందుతాయన్నారు. మహిళా బిల్లులో సబ్ కోట ఉన్నప్పుడే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో రక్షణ శాఖకు 10 శాతం నిధులు కేటాయిస్తున్నారని దివంగత నేత ముఖ్యమంత్రి ఎస్పీ వ్యవస్థాపకులు మునియన్ సింగ్ యాదవ్ రక్షణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు 20% నిధులు రక్షణ శాఖ కేటాయించి దేశ భద్రతను కాపాడారన్నారు. టీటీడీ దర్శనం సామాన్యులకు పేదలకు అందుబాటులో లేదని, హిందూ దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయం ఇతర మతాల వారికి మళ్లించడం సరైనది కాదన్నారు. ఎస్సీ ఎస్టీ, బిసి మైనారిటీలు ఓసి లోని పేదలందరకి సామాజిక న్యాయం జరగాలంటేఎస్ పి ఆదరించాలని కోరారు. ఎస్ పి అధినేత అఖిలేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు.సమావేశంలో పశ్చిమ రాయలసీమ ఇన్చార్జి పాండురంగ యాదవ్, నంద్యాల జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, మూలయ బ్రిగేడ్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, పొద్దుటూరు ఇన్చార్జి పెద్దన్న, మహిళా విభాగం రాష్ట్రసహాయకార్యదర్శి షేక్ పరిదాబి,పోతిరెడ్డి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కల్లూరు : ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని ఏపిఎం శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కర్నూల్ నగరం లోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్లో డిఆర్డిఏ ,వైకెపి ఉద్యోగులు మూడవరోజు నిరవధిక దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, రాఘవేంద్ర ,అబ్దుల్ రహిమాన్,నాగేంద్రలు మాట్లాడుతూ దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఉద్యోగ భద్రత లేకపోవడంతో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి అన్ని విధాల న్యాయం జరిగేలా చూడాలన్నారు. కారుణ్య నియామక విధానాన్ని శాఖలో అమలుచేసి నష్టపోయిన కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగుల సత్తా చాటుతామని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండలం సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ఓటే ఆయుధం

విశాలాంధ్ర - సి.బెళగల్ : ప్రజాస్వా మ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ప్రజలు వేసే ఓటే ఆయుధమని సిబెళగల్ మండల తహసిల్దార్ శేషఫణి అన్నారు. గురువారం 14వ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన సి.బెళగల్ లో ని మండల తహసిల్దార్ కార్యాలయం ముందు తహసిల్దార్ ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు మరియు ఈ ఓ ఆర్ డి సందీప్ మరియు విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితర అధికారులతో కలిసి 14వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అధికారులందరితో కలిసి తహసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా శాంభవి దేవి పూజలు

విశాలాంధ్ర-కోసిగి : మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో వెలసిన శాంభవి దేవిని మంత్రాలయం టీడీపీ బీసీ నాయకులు మాధవరం రాఘవేంద్ర రెడ్డి , ముత్తు రెడ్డి ,రామిరెడ్డి, ఉలిగయ్యలు గురువారం దర్శించుకున్నారు. బారి ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో శాంభవి గుడి దగ్గరకు కార్యకర్తలు చేరుకున్నారు. అమ్మవారిని ఆలయ అర్చకులు ఫలా,పుష్ప అలంకరణలు ,మహా మంగళ హారతులు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు కర్ణాటక ,ఆంధ్ర నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దర్శనంతరం పీఠాధిపతి మఠ్రిస్వామి తాత మంత్రాలయం టీడీపీ బీసీ నాయకులను శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్లబండ గ్రామ సర్పంచ్ మల్లికార్జున,అయ్యప్ప,బుజ్జి, రాజేంద్రనాయుడు , వీరారెడ్డి , వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

విశాలాంధ్ర - హొలగుంద : మండలంలోని ఓటు హక్కు పొందిన అందరూ వచ్చే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని తాసిల్దార్ హుస్సేన్ సాబ్ విజ్ఞప్తి చేశారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జడ్పీ హైస్కూల్లో హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ గురువారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ తాసిల్దార్ రెవిన్యూ సిబ్బంది ఓటరు దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. తాసిల్దార్ హుస్సేన్ సాబ్ మాట్లాడుతూ మండలంలో 41765 మంది ఓటు హక్కును పొంది ఉన్నారని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని ఓటు వజ్రాయుధం లాంటిదని ఎన్నికల్లో ఓటు హక్కు పొందిన వారు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్, ఆర్ ఐ దినేజ్ కుమార్, విఆర్ఓ నాగరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు రెవెన్యూ సిబ్బంది బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మ ఆశయాలను నెరవేర్చిన జగన్

విశాలాంధ్ర - గోనెగండ్ల : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాడు చేపట్టిన పాదయాత్ర లో పాదయాత్రలో రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలకిచ్చిన ప్రతి హామీలు నెరవేస్తున్నాడని మాజీ కో ఆప్షన్ సభ్యులు టీ కే బందేనవాజ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో మరియు మండలం స్వయం సహాయక సంఘాలకు ఆసరా పథకాన్ని పురస్కరించు కొని 4వ విడతలో 3,48,45000కోట్లు వారి నగదును వారి ఖాతాల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి జమ చేశారని తెలిపారు.గోనెగండ్ల మండల మండలం అక్క చెల్లెమ్మ తరపున ముఖ్యమంత్రి కీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆసరా నాల్గవ విడత మెగా చెక్కు ను లబ్దిదారులైన మహిళల చేతుల మీద విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో భారతి ఎంఎంఎస్ ఉపాధ్యక్షురాలు తిమ్మక్క, లక్ష్మి ప్రసన్న, కాంట్రాక్టర్ ఈశ్వర్, కటికే మాబువలి, నాగలదిన్నె ముహమ్మద్, విఓఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

విశాలాంధ్ర - గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్ల లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జాతీయ 14వ ఓటరు దినోత్సవాన్ని తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ సీఈవో నాసిర్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల ర్యాలీ కార్యక్రమాన్ని సీఈవో ప్రారంభించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణం లో విద్యార్థుల చేత ఉపాధ్యాయులు మానవహారం చేపట్టారు.18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు గా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో బాబు, ఎంఈవో భాస్కర్, నీలకంఠ, హెచ్ ఎం నాగభూషణం, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అబ్దుల్ సలీం,స్వర్ణ, మణి కుమారి,నసీరుల్లాబేగ్, వీఆర్వో లు రంగముని,కిషోరు, పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం లో ప్రజలకు వంచన

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : రాష్ట్రంలో పాదయాత్రలో భాగంగా ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయకుండా వంచించారని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాలు యాదవ్ విమర్శించారు గురువారం మండల కేంద్రమైన కోవెలకుంట లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేస్తామని చెప్పి అమలు చేయక ప్రజలను మంచించారని అన్నారు రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉమ్మడి జిల్లాల పర్యటన ఈనెల 29న ఉంటుందని ప్రజలు ఆ పర్యటన విజయవంతంగా జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని మాట తప్పి మడమ తిప్పారు అన్నారు ఇప్పటికైనా ప్రజలు మేలుకొని వైఎస్ఆర్సిపి పార్టీకి బుద్ధి చెప్పాలని హితువు పలికారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులను అడ్డుకున్న వార్డు ప్రజలు, కౌన్సిలర్

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని రెండో వార్డులో రిలయన్స్ జియో కంపెనీకి సంబంధించిన ప్రతినిధులు వార్డులో కంపెనీకి సంబంధించిన సెల్ టవర్ నిర్మాణం చేపట్టడానికి గురువారం చేపడుతుండగా,ఈ విషయాన్ని గమనించిన వార్డు ప్రజలు జియో సెల్ కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగి టవర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రెండో వార్డ్ కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ హుటాహుటిన రెండో వార్డ్ లో సెల్ టవర్ నిర్మాణం పనులు చేపడుతున్న స్థలానికి చేరుకొని వార్డు ప్రజలతో కలిసి జియో కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ఎవరి అనుమతితో వార్డులో సెల్ టవర్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, సెల్ టవర్ నిర్మాణ పనులకు రెండో వార్డులో ఏర్పాటు చేయొద్దని అధికారులకు కూడా తెలియజేయడం జరిగిందని ఆయన హెచ్చరించారు. అయినా మీరు ఎవరిని అడిగి ఇక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారని ఎవరు అనుమతులు ఇచ్చారని పత్రాలు ఏమైనా ఉంటే చూపించండి అంటూ ప్రశ్నించారు. అందుకు రిలయన్స్ జియోకంపెనీ ప్రతినిధులు తమకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చారని వారి అనుమతులతోనే నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులకు సంబంధించిన అనుమతుల పత్రాలను కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ కు చూపించగా పత్రాలు పరిశీలించిన కౌన్సిలర్, ఈ పత్రాలపై ఎలాంటి అనుమతులు లేవని మున్సిపల్ కమిషనర్ సంతకం గాని సీలు గాని లేదని అనుమతులు లేని పత్రాలతో మీరు సెల్ టవర్ నిర్మాణ పనులు ఎలా చేపడతారని కౌన్సిలర్, వార్డు ప్రజలు జియో కంపెనీ ప్రతినిధులపై మండిపడ్డారు. అనంతరం కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ చరవాణిలో మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. రెండో వార్డులో సెల్ టవర్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, వాటికి మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చారని జియో కంపెనీ ప్రతినిధులు తెలుపుతున్నారని ప్రజలకు ఇష్టం లేని పనికి ఎలా అనుమతిస్తారని మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మేము ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, సెల్ టవర్ పనులను నిలుపుదల చేయిస్తామని మున్సిపల్ అధికారులు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ కు సమాధానం ఇచ్చారు.దీంతో కౌన్సిలర్ మీకు ఎలాంటి అనుమతులు లేనప్పుడు సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టడం సమంజసం కాదని నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సెల్ టవర్ నిర్మాణం పనులు మున్సిపల్ అధికారుల అనుమతులతో చేపడుతున్నామని జియో ప్రతినిధులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఈ విషయంపై నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతానని సెల్ టవర్ నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేసేలా చేయిస్తానని వార్డు ప్రజలకు కౌన్సిలర్ హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర - చాగలమర్రి :నిజమైన భూమా కార్యకర్తలకు తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీమంత్రి భూమా అఖిలప్రియ తెలియజేశారు.మండలంలోని చిన్న వంగలి గ్రామంలో దాదాపు 100 కుటుంబాలు వైసిపి నుంచి మాజీ మంత్రి సమక్షంలో టిడిపిలో చేరాయి గ్రామానికి చేరుకున్న మాజీ మంత్రికి టిడిపి నాయకులు పెద్ద ఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వైసీపీ కిచెందిన నరేంద్ర రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీరామ్ రెడ్డి,గురు ప్రసాద్ రెడ్డి, సంజీవరెడ్డి, పెద్దరాజు, చిన్నరాజు, కురువ నరసింహుడు రమేష్ యాదవ్, లక్ష్మీ నరసింహుడు భాష, లతో సహా వంద కుటుంబాలు టిడిపి లో చేరాయి ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూగ్రామానికి చెందిన నాయకులు అధికారంలో ఉన్నప్పుడు పనుల కోసం మాత్రమే వచ్చారు తప్ప అధికారం లేనప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమవైపు కూడా తిరిగి చూడలేదని, పార్టీ వైపు గానీ తమకు గానీ అండగాలేరని విషయాన్ని గుర్తు చేశారు.నేడు గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున స్వాగతం పలికిన నిజమైన కార్యకర్తలకు భూమా కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు అధికారంలో ఉన్న లేకున్నా కార్యకర్తలకు తమ కుటుంబం అండగా నిలిచిందే తప్ప ఎప్పుడూ వెనకడుగు వేసింది లేదన్నారు. చిన్న వంగలి గ్రామంలో ప్రధానంగా ఉన్నటువంటి సమస్యలు అయినా అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయి నీటి కుంట ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు అలాగే గ్రామంలో ప్రతి కాలనీకి సిసి రోడ్లు, ప్రధానంగా ఎదుర్కొనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమం లో నియోజకవర్గ టిడిపి నాయకులు భార్గవ్ రామ్,టిడిపి నాయకులు మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, సంజీవరెడ్డి,గురుశేఖర్ రెడ్డి,నరసింహారెడ్డి,ఇండ్లలక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మం,గుత్తినర్సింహులు,కొలిమి హుసేన్‌వలి,షరీఫ్,పాల షరీఫ్, నాగేంద్ర, నారాయణరెడ్డి, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయ ఢంకా మోగించిన రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు రోజురోజుకు విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఎన్నో ప్రశంసలకు సిద్ధమవుతున్నారు. ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ఉన్నత ప్రతిభ కనబరుస్తూ జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొంటూ మంచి పేరు ప్రఖ్యాతులను పొందుతున్నారు. ఇందులో భాగంగానే ఆదర్శ పాఠశాలలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస)నకు రుద్రవరం ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపిక య్యారు అని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపినారు. 2023 డిసెంబర్ జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలో ఎనిమిదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులు గౌరీ,దివ్య, సుచిత్ర ,స్పందన ,శృతి ,చైతన్య, సందీప్ కేశవ, నాగేంద్రలు ఉత్తమ ప్రతిభ చూపి ఎంపిక అయ్యారు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి అర్హత సాధించడం,వారి తల్లి తండ్రులకి ఆర్థికంగాఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.కష్ట పడితే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు.వీరికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున నాల్గు సంవత్సరాల పాటు స్కాలర్ షిప్ అందనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.మా టీమ్ అయినా 8వ తరగతి బోధించిన ఉపాధ్యాయ బృందం మధు,చవాన్,విజయలక్ష్మీ ఎంతో సహకారం అందించి ప్రత్యేక తరగతులు తీసుకొని మరీ బోధించారు అని అన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, 8 మంది విద్యార్థులు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వైయస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని ఏ.బి.యం పాలెం నందు వై.యస్.ఆర్ ఆసరా నాలుగవ విడత సంబరాలు గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి కమీషనర్ కిషోర్, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి కౌన్సిలర్ కాటెపోగు చిన్నరాజు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ఆర్ ఆసరా ద్వారా 4 విడతల్లో రూ.25,571 కోట్లు అక్కా చెల్లెమ్మలకు ప్రయోజనం చేకూరిందని, నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 4వ విడత “వై.యస్.ఆర్ ఆసరా ద్వారా రూ.4 కోట్ల 40 లక్షల 43 వేలు జమ చేయడం జరిగిందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నారని,ఇంటింటికీ నవరత్నాలు రాజకీయాలకు అతీతంగా ఆమలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టి.యమ్.సి శాంత కుమారి, సి.ఓ అర్చన, వినయ్, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు బొల్లెద్దుల రామక్రిష్ణ, కౌన్సిలర్ లాలు ప్రసాద్, వైఎస్సార్సీపి పట్టణ ప్రధాన కార్యదర్శి మార్కెట్ రాజు, జిల్లా ఎక్జిక్యూటివ్ సభ్యురాలు సులోచనమ్మ, వైసిపి నాయకులు పి.రమేష్ మరియు అర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కస్తూరిభా విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

విశాలాంధ్ర - బేతంచెర్ల : మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల విద్యాధికారి జి.సోమశేఖర్,పాఠశాల ప్రిన్సిపల్ అబిదా బేగంలు ట్యాబ్ లను గురువారం వారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 8 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ట్యాబ్ ల ద్వారా మంచి బోధన లభిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి థాంక్స్ జగన్ మామయ్య అంటూ కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన ముఖచిత్రం ఉన్న కేక్ ను కట్ చేసుకుని, తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నంద్యాల రోడ్డులోనీ వీవర్స్ కాలనీలో దీబగుంట్ల ప్రతాప్ కు చెందిన గడ్డివాము గత శనివారం ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యింది. విషయం తెలుసుకున్న శెట్టి విజయ్ కుమార్ వెంటనే స్పందించి గురువారం బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. మానవతా దృక్పథంతో బాధితుడికి రూ.10 వేలు చెక్కు ను అందించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారికి సాయం అందించేందుకు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శెట్టి విజయకుమార్ కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ కాప్స్ రాష్ట్ర సలహాదారుడు గూడూరు సంజీవరాయుడు,రాయల్ కాప్స్ ఏపీ, తెలంగాణ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివ రాయల్, మైలారు శ్రీనివాసులు, బండి నరసయ్య, వీరయ్య, నీలి రామారావు,నవకాంత్ సాఫ్వేర్, రాటాల నరసింహ, మునయ్య, సిద్ది నారాయణ, జిల్లా సుబ్బరాయుడు, న్యాయవాది యాగటీల రంగస్వామి , శ్రీపతి ప్రసాద్, వరద పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటును వినియోగించుకోవడం అందరి బాధ్యత

విశాలాంధ్ర - కొత్తపల్లి : 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ డిప్యూటీ తహసిల్దార్ పెద్దన్న తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో విద్యార్థులతో తహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి అన్నారు. ఓటు లేని వారు ఓటును ఎక్కించుకోవాలి అన్నారు. ఓటు వజ్రాయుధం ఓటును నిజాయితీగా వేయాలి అన్నారు. ఓటు నిజాయితీపరులకు వేయాలి అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - సి.బెళగల్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సి.బెళగల్ గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మరియు 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) నందు ప్రవేశం కొరకు బాలుర నుండి దరఖాస్తులను చేసుకోవాలని గురుకుల పాఠవాల ప్రిన్సిపాల్ బలరాముడు గురువారం తెలిపారు. విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని గురుకుల పాఠశాలలో (ఎంపీసీ మరియు బైపీసీ (ఇంగ్లీష్ మీడియం) గ్రూప్స్ ఉన్నాయని ప్రతి గ్రూపు నందు 40 సీట్లు అలాగే ఐదవ తరగతి (ఇంగ్లీష్ మీడియం) నందు 80 సీట్లు ఉన్నాయన్నారు. వీటిని ఎస్సీ క్యాటగిరికి 75% అలాగే కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 12% ఎస్టీ కేటగిరికి ఆరు పర్సెంట్ అలాగే బీసీ కేటగిరికి ఫైవ్ పర్సెంట్ మరియు ఇతరులకు 2% ప్రకారం రిజర్వేషన్ కేటాయించబడతాయన్నారు. ప్రతి విద్యార్థి యొక్క తల్లి తండ్రి సంరక్షకుల సంవత్సరాదాయః (2023-24) నుండి ఒక లక్ష రూపాయల ఆదాయంకు మించి ఉండరాదని అందువలన అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను 25-01-2024 నుండి 23-02-24 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నిరంతరం పోరాడే పార్టీని ఆదరించండి

విశాలాంధ్ర - బనగానపల్లె : రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపులో భాగంగా బనగానపల్లె పట్టణంలో సిపిఐ నాయకులు కరపత్రాలు పంచుతూ పార్టీ కోసం విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం ప్రజల హక్కుల కోసం, రైతాంగ సమస్యలపై,నిరుద్యోగుల సమస్యలపై,మహిళల హక్కుల కోసం, కార్మికుల అభ్యున్నతి కోసం,కాంటాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం,నిరంతరం ప్రజా సమస్యలపై, ప్రభుత్వాలు అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ కి విరాళాలు అందించి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి , ప్రజానాట్యమండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య ,చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు శివ సుబ్రహ్మణ్యం, హుసేని ,సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

62లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణంలోని 42, 39 వార్డులలో 62 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణపు పనులను ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎంపీ పోచా బ్రాహ్మనంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మభూన్నిసా, కౌన్సిలర్స్ శిరీష, వెంకటలక్ష్మి వార్డు ఇన్చార్జులు కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ ప్రారంభించారు. 42 వార్డు పరిధిలోని శ్రీ జంబులా పరమేశ్వరి ఆలయం సమీపంలో ఎంపీ నిధుల నుండి 42 లక్షలలో సిసి రోడ్డు, అలాగే 39వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధుల నుండి 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను చేపట్టడం జరిగింది. నంద్యాల ఓల్డ్ టౌన్ పై ప్రత్యేక దృష్టి సారించి ఆ ప్రాంత రూపురేఖలను మార్చేందుకు కృషి చేశామని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ఓల్డ్ టౌన్ రూపురేఖలను మారుస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు మరింత చేరువ అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి , జేసిఎస్ కన్వీనర్ దాల్మిల్ అమీర్, కౌన్సిలర్స్ సాదిక్ భాషా కృష్ణమోహన్, దేశం సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.